# వెన్నెలకాసిన చీకటి బతుకు!

భ.ఇ.ఓ. వెంకటేశ్వర్లు



డైరక్టర్ రామచంద్రయ్యతో ఢిల్లీ కాన్ఫరెన్సుకు వెళ్ళిన ఆయన స్టెనో గ్రాఫరు సంధ్యారాణికి, హైదరాబాదు నుంచి ఆమె భర్త చక్రవర్తి పనిచేసే ఆఫీసు నుంచి టెలిఫోన్ వచ్చింది– "ఆమె భర్తకు చాలా సీరియస్‌గా వుంది" అని

ఆమె గుండె క్షణంపాటు ఆగినట్టనిపించింది. "నిజంగా సీరియస్‌గా వుందో లేక..." ఆ పైన ఆలోచించలేకపోయింది తను.

కొన్ని నెలల్నుంచి ఆ భార్యాభర్తల మధ్య సంసార సంబంధాలు లేవు... అయినంత మాత్రాన, భర్త గురించి తను నిర్లక్ష్యంగా ప్రవర్తించలేదు కదా! తనకు తాళి కట్టిన వాడు... తనలోని మాతృత్వాన్ని వెలికి తీసిన వాడు... ఓ కొడుక్కి తండ్రి అనిపించుకొన్నవాడు .. అతనెటువంటివాడైనా, తన బతుకులో అశాంతి, చీకటిని కల్పించినప్పటికి ...భర్త కాకుండా పోడు!

* * *

ఆ రోజు చక్రవర్తి ఆఫీసుకు పదకొండు గంటలకు వెళ్ళాడు. ఆఫీసుకు వచ్చేముందర ఓ బాటిలు బీరు తాగటం అతనికి అలవాటు. అటెండెన్సు రిజిష్టరులో సంతకంచేయటం, ప్యూను సాంబయ్య కాఫీతోపాటు సిగరెట్ పెట్టె అందివ్వటం అయిదేళ నుంచి జరుగుతున్నదే!

అతను కాఫీ తాగి, సిగరెట్ వెలిగించాడు. పది నిముషాలు గడిచాయి. "ఫ్యాను వెయ్యి సాంబయ్యా!" అన్నాడు.

కాని ఫ్యాను ఫుల్ స్పీడులోనే తిరుగుతోంది

అతనికి బాగా ఉక్కబోతగా వుండి, చెమటలు పోస్తున్నాయి. ఎందుకో ఒక్కసారి అనాలోచితంగా అరిచి పడిపోయాడు... చక్రవర్తి.

నోటో వున్న సిగరెట్ క్రిందకు జారటం, టేబుల్ పై కాఫీగ్లాసు నేలమీద పడటం, రక్తం టేబుల్ పైనా, బట్టలపైనా వాంతి చేసుకోవటం... అంతా ఓ నిముషం లోపలే జరిగిపోయాయి.

ఆ దృశ్యం చూసికు సహోద్యోగులు, వెంటనే అతన్ని ఆఫీసు ఆవరణలోనే వున్న డిస్పెన్సరికి తీసుకు వెడుతుంటేనే, ప్రాణాలు వదలటం ఎవరూ గుర్తించలేదు.

డాక్టరు చక్రవర్తి నాడి, గుండె పరీక్షించాడు. అతను చనిపోయినట్టుగా ప్రకటించాడు.

డిస్పెన్సరి అధికారులు, యితర ఉద్యోగులతో నిండిపోయింది.

ఈ విషయాన్ని ఆ వూళ్ళోనే వున్న అతని తల్లిదండ్రులకు, అత్తమామలకు తెలియబరిచారు. సంధ్యారాణికి మాత్రం "సీరియస్"గా వున్నటు ఫోనుచేసి చెప్పారు.

చక్రవర్తి అంత్యక్రియలు అతని తల్లి దండ్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, అధికారుల సమక్షంలో జరిగాయి. అతని శరీరం రక్తానికి బదులు ఆల్కహోలుతో నిండి వుండటంతో, శవం కాలేందుకు కేవలం ఇరవై నిముషాల కంటే ఎక్కువ పట్టలేదు.

సంధ్యారాణి మూడో రోజుకు హైదరాబాదు చేరింది.

* * *

చక్రవర్తి పదేళ్ళ క్రిందట ఉద్యోగంలో చేరాడు. మొదట్లో మా యిద్దరి సెక్షన్లు పక్కపక్కనే ఉండటంతో, అతనితో సెక్షను పనికి సంబంధించిన విషయాల్లో పరిచయం కలిగింది. తరువాత మా సెక్షనులో ఓ ఖాళీ ఏర్పడితే, అతన్ని మా సెక్షనుకు ట్రాన్స్‌ఫరు చేయటం జరిగింది.

కొద్ది రోజుల్లో మా పరిచయం స్నేహంగా మారిపోయింది.

అతని వయస్సు ముప్పై రెండు.ఆరున్నర అడుగుల ఎత్తు హిప్పీ కాపు. రొయ్య మీసాలు... అతను ఓ చైన్ స్మోకర్. దాదాపు అయిదారు రకాల సిగరెట్లు, ఎప్పుడూ డ్రాయర్లో నిలవ వుంటాయి.

చక్రవర్తికి మూడేళ్ళ క్రిందటే వివాహం అయింది అతని భార్య సంధ్యారాణి, ఓ ప్రభుత్వ సంస్థ డైరక్టరు దగ్గర స్టెనోగా పనిచేస్తోంది వారిద్దరిదీ ప్రేమ వివాహం కాదు .. పెద్దలు నిర్ణయిందీ కాదు

తాము 'సరే' అనుకోగానే పెద్దలు 'ఓ,కే' చేసారు, అంతే!

* * *

చక్రవర్తి ఎకౌంట్సు సెక్షనులో యుడిసి! జీతాల బిల్లులు తప్ప మిగిలిన ఏ బిల్లయినా 'బరువు' పెట్టందే చూడడు. ఓవర్ టైము, ఇంక్రిమెంట్సు, ప్రావిడెంటుఫండు, యితర ఆర్థిక బిల్లులు- పార్టీలు వచ్చి డబ్బు యివ్వందే, పాడ్లోంచి బయటకు తీయడు.

అయితే పార్టీలు అతనికిచ్చే మామూలు తమకొచ్చే 'లాభం'తో ముడిపడి వుంటుంది.

వచ్చిన కాగితాలు చూసి, పార్టీలకు వివరించేందుకు 'సంప్రదింపుల ఫీజు' అంటూ కనీసం అరవై, డెబ్బై కళ్ళ చూడందే సీట్లోంచి కదలడు. ఏ రోజు వసూళ్ళు ఆ రోజే, ఆఫీసరు అప్పలస్వామితో కలిసి బారులో ఖర్చు చేసేస్తాడు పాపపు డబ్బు యింటి అవసరాలకు ఖర్చు చేయరాదనే నియామకానికి వారిద్దరూ కట్టుబడి వుంటారు.

చక్రవర్తికి కాలేజీ చదువులనుంచే అమ్మాయిల వేటలో అనుభవం వుంది. దాన్ని ఓ కళగా ఆరాధిస్తూ, ప్రావీణ్యం పొందేడు. కేవలం చూపులతోటే "కేసు" అని నిర్ణయించి, దగ్గరవుతాడు. అతని కౌగిట్లో ఎందరో అందమైన కాలేజీ అమ్మాయిలు కరిగిపోయారు.

ఓ హాబీగా ప్రారంభమైన ఆ కళ, ఉద్యోగం వచ్చాక, చేతిలో డబ్బు కనబడేసరికి —అది వికృతమైపోయింది. సరిగ్గా అటువంటి సమయంలోనే, ఓ సందర్భంలో ఆఫీసరు అప్పలస్వామితో పరిచయం ఏర్పడింది.

ఇద్దరిదీ ఒకేవిధమైన అభిరుచిఅవటంతో, చక్రవర్తిని ఎకౌంట్సు సెక్షనుకు ట్రాన్సఫరు చేయించుకొన్నాడు అప్పలస్వామి, తన అవసరాలు తీర్చుకునేందుకు పార్టీల నుంచి బిల్లులకు "రేటు" నిర్ణయిస్తూ చక్రవర్తికి సూచనలిచ్చేవాడు అప్పలస్వామి.

అప్పలస్వామి వయస్సు ఏభైకి చేరుతున్నా బయటి "ఆడగాలి" కోసం కొట్టుకుపోయే వాడు. చక్రవర్తి వచ్చాక, ఆయన పని తేలికయింది.

అయితే వారిద్దరిమధ్యా "ఆఫీసరు — యుడిసి" అనే భేదం ఎప్పుడూ రాలేదు. ఈ వ్యవహారాలన్నీ హోటల్ "అభిసారిక" లో జరిగేవి.

చక్రవర్తి తరచు అమ్మాయిలను వెంట బెట్టుకొని షికార్లు, సినిమాలు, బారులు మొదలైన చోట్లకు తిరిగేవాడు. శరీర సుఖం కోసమో, డబ్బు అవసరంతోటో, అమ్మాయిలు అతన్ని ఆశ్రయించేవారు.

* * *

ఓ రోజు చక్రవర్తి నన్ను హోటల్ లేపాక్షికి తీసుకెళ్ళాడు. అందులో పదిహేడో నెంబరు గదిలో ఓ అజంతా సుందరి అతని కోసం ఎదురు చూస్తోంది.

ఆమెను చూడగానే నాకు కళ్ళు బైర్లు కమ్మాయి, గుండె వేగం హెచ్చింది... కాళ్ళు వణకసాగాయి.

నన్ను లోపలికెళ్ళమన్నాడు చక్రవర్తి.

"నా కవసరంలేదు ... నేనలా బయట రిసెప్షను కౌంటరు దగ్గర కూర్చుంటాను ...నీ పని ముగించుకొని రా !"

మర్నాడు పదకొండు గంటలకు చక్రవర్తి నా దగ్గరికి వచ్చాడు.

"ఏమయ్యా! దాన్ని చూడగానే అలా అయిపోయువేమిటి ? జీవితంలో అన్నిరకాల అనుభవాలు రుచిచూడాలి... నీకు తెలియనిది కాదు- ఈ రోజుల్లో డబ్బు సంపాదించటం, బోడిగుండును విగ్గుతో కవర్ చేసుకోడం, మంత్రిపదవికోసం ఢిల్లీలో బైఠాయింపు చేయటం, వేసక్టమీ ఆపరేషనును 'రీకానలైజేషను' ద్వారా తిరిగి సంతానం పొందడం .. మామూలే! కాని వయస్సు, యవ్వనం పోతేమాత్రం తిరిగి పొందలేం! అందుకే వయసును, యవ్వనాన్ని ఆరాధించా లంటే, అప్పుడప్పుడు యిలా 'సుఖం' పొందాలి..." అంటూ త్రిబుల్ ఫైవ్ సిగరెట్ వెలిగించి, పొగను ధారాళంగా గాలి లోకి వదిలాడు చక్రవర్తి.

అతని తెలివితేటలకు, మాటకారితనానికి నాకాశ్చర్యం వేసింది.

"ఇంతకీ ఆ సుందరితో ఎంతసేపు న్నావ్ ? ఏమిచ్చావ్ ?" అని అడిగాను.

ఆ మాటలకు అతను నవ్వాడు.

"ఆటోలో కూర్చుని, ఊరంతా తిప్పమన్నా తిప్పుతాడు ఆటోడ్రైవరు ... మన జేబులో డబ్బులుండాలేగాని. అటువంటి వాళ్ళని మనలాంటి 'యుడిసీ'లు ఓ గంట కన్నా ఎక్కువసేపు ఆరాధించలేం! రెండు వందలు యిచ్చాను ... మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు ? ఓ ముద్దు 'డిస్కౌంటు'గా యిస్తూ అడిగింది...' అని చెప్పాడు.

"గంట సుఖానికి రెండువందలు ఖర్చు చేసే వాడుంటాడా ?" కాకతాళీయంగా ఆ మాటలు నోటినుంచి వచ్చేసాయి.

"నువ్వొఠ్ఠి పిచ్చివాడివయ్యా! ..." అంటూ ఏదో చెప్పబోయాడు...ఆ రామాయణాన్ని పొడిగించటం యిష్టంలేదు. ఎంతసేపయినా విసుగు, బోర్ కలిగించకుండా చెప్పుకుపోయే తత్వం అతనిది.

"నాకు అర్జంటుగా వెయ్యిరూపాయలు కావాలి" అడిగాడు చక్రవర్తి. నాకాశ్చర్యం వేసింది. అతనికి జీతం ఎనిమిదివందలు దాకా వస్తుంది...అప్పుడప్పుడు తండ్రి రెండు, మూడు వందలు యిచ్చి వెడుతుంటాడు. పార్టీల ద్వారా అరవై, డెబ్బైదాకా రోజు సంపాదిస్తాడు...అయినా అప్పు ఎందుకో ?" అర్థంకాలేదు.

"అతనేం చేసుకొంటే నాకెందుకు ?" ఓ తెలిసిన స్నేహితుడి దగ్గర 'నోటు' రాయించి, అయిదురూపాయల వడ్డీమీద యిప్పించాను.

ఆ తరువాత మరో నాలుగయిదుసార్లు యిప్పించటం జరిగింది.

* * *

ఒకరోజు టాంక్‌బండ్ బస్టాపుదగ్గర — సంధ్యారాణి బస్సుకోసం ఎదురు చూస్తోంది. చక్రవర్తి కూడా ఆమెకు సమీపంలోనే నిలబడ్డాడు. పావుగంట నుంచి ఆమెనే గమనిస్తున్నాడు. తన ఆలోచన సరియైనదే అనుకోగానే, దగ్గరకెళ్ళి సంభాషణ ప్రారంభించాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందే!" అని.

అయిదు నిముషాలు యిద్దరి మధ్య ఏవో

కబుర్లు దొర్లాయి. అతనిలోని కోరిక, ఉద్రేకం అంతకంతకూ ఎక్కువ కాసాగాయి.

"మీకేమీ అభ్యంతరం లేకపోతే అలా లిబర్టీ థియేటరుకు వెడదాం..." అన్నాడు.

"క్షమించండి... నేను మీరనుకొనేదాన్ని గాను... దయచేసి లోకంలో ఆడవాళ్ళందరూ మీ మగవాళ్ళ కోరికలు తీర్చేందుకు సిద్ధంగా వుంటారని అపోహ పడకండి!" సున్నితంగా మందలించిన ధోరణిలో అంది ఆమె.

చక్రవర్తి ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు. తన అంచనా ఈ రోజు ఎందుకిలా తప్పయింది? కొన్నేళ్ళుగా 'వేట'లో అనుభవం తన కుంది చూసినదాన్ని కదిలించటం, రెండు నిముషాల్లో అనుకూలంగా సిగ్నల్ రావటం, ఈలోపల ఓ ఆటో రావటం, మరో పది నిముషాల్లో దగ్గర్లో వున్న ఓ మంచి హోటలు గదిలో కెళ్ళటం, ఓ గంటసేపు వచ్చిన స్త్రీతో 'రాసలీల' సాగించటం, అలవాటుగా జరుగుతోంది. అటువంటిది తను ఓడిపోయాడు.

ఇంతలో సంధ్యారాణి ఎక్కవలసిన బస్సు వస్తే, ఆమె వెళ్ళిపోయింది. చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు.

* * *

రెండు నెలల తరువాత ఓ రోజు—

సంధ్యారాణి చక్రవర్తి పనిచేసే ఆఫీసులోనే పనిచేస్తున్న స్నేహితురాలు శోభాదేవిని కలిసేందుకు వెళ్ళింది. తన తండ్రికి రావలసిన ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీ, ఇన్సూరెన్సుల విషయమై విచారించేందుకు ఆమె శోభాదేవితో కదిపింది.

నాలుగు నెలల క్రితం సంధ్య తండ్రి రిటైరయ్యాడు.

శోభ విచారిస్తే, ఆ కాగితాలు చక్రవర్తి దగ్గరే నిద్రిస్తున్నాయని... ఆమె తండ్రి కోసం ఎదురు చూస్తున్నాయని చెప్పింది.

సంధ్య తండ్రి చక్రవర్తిని కలిసి అయిదు వందలు సమర్పించుకొని, తనకింక శక్తిలేదని, బిల్లు ప్యాసు చెయ్యమని అర్థించేడు.

ఇరవై రోజుల తరువాత కాగితాలు నడిచేందుకు వీలు కలిగింది.

* * *

ఒకరోజు చక్రవర్తి, సంధ్యారాణి రేడియో స్టేషను దగ్గర బస్టాపులో యాదృచ్ఛికంగా కలిసారు. ఈసారి ఆమె, అతని కోరిక ననుసరించి, 'కాఫీ'కి 'హోటల్ అభిసారిక'కు వెళ్ళింది.

మాటల మధ్యలో చక్రవర్తి "మిస్. సంధ్యారాణి! నాదో చిన్న రిక్వెస్టు" అంటూ ప్రస్తావించాడు.

ఆమె అతనివైపు పరిశీలగా చూసింది.

"నేను మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకొంటున్నాను."

ఈసారి ఆమె ఆశ్చర్యపోయింది. తన వయస్సు పాతికకు చేరుకుంటున్నా, తన కటువంటి ఆలోచన కలగలేదు. తన అక్కకు ముందర పెళ్ళి కావాలి. ఆ తరువాతే తనకి! అనుకొందిప్పటివరకూ.

ఆమెను వివాహం చేసుకోవాలనుకోడంలో, చక్రవర్తి ఆలోచన వేరు, సంధ్యారాణి సంసారపక్షంగా వుండే అందగత్తె! పైగా పోస్టు గ్రాడ్యుయేట్... అందచందాలు, ఒంపుసొంపులుతో యున్నాళ్ళూ తనని కవ్వించింది. పైగా ఉద్యోగిని. అంతకన్నా ఏం కావాలి?

తన అంగీకారాన్ని కళ్ళతోనే తెలియబరచిందామె. చక్రవర్తి మనసెంతో తేలికయింది.

చక్రవర్తి తన ఉద్దేశాన్ని తండ్రికి తెలిపాడు, ఆయన కూడా ఆశ్చర్యపోయాడు. తను అయిదేళ నుంచి వివాహ ప్రయత్నాలు చేస్తున్నప్పటకి, కొడుకు ఏదో కారణాలు చెపుతూ దాటేస్తున్నాడు.

తన కొడుకెందుకిలా చేస్తున్నాడో, తండ్రికి అర్థం కాలేదు టెలిగ్రాం ద్వారా ఓసారి యింటికి పిలిచి, అక్షింతలు వేసాడు.

సన్నివేశం పతాక స్థాయిని చేరింది.

"పెళ్ళంటూ చేసుకొంటే ఆమెనే చేసుకొంటాను... నాకు శాఖ, గోత్రంతో పనిలేదు..." అంటూ సంధ్యారాణికున్న ప్లస్ పాయింట్లు వివరించాడు చక్రవర్తి.

నెల తిరిగేసరికి చక్రవర్తి తండ్రి, సంధ్యారాణి తండ్రితో మాటలాడి, వారిద్దరికీ వివాహం జరిపించేరు.

* * *

సంధ్యారాణి కాపురానికి వచ్చి ఎనిమిది నెలలయింది. ఆమె యిప్పుడు అయిదోనెల గర్భవతి. ఆమె తల్లిదండ్రులు అదేవూరిలో వుండటంవల్ల, అయిదో నెలలోనే సీమంతం జరిపించి, పుట్టింటికి తీసుకువెళ్ళారు వాళ్ళు.

ఇన్నాళ్ళూ పంజరంలోవున్న చక్రవర్తికి, యిప్పుడు స్వేచ్ఛ లభించింది. ఆఫీసులో ఆదాయం పెరిగింది. అప్పలస్వామిని ఢిల్లీ ట్రాన్స్‌ఫరు చేయటంతో, ఆయన వాటా కూడ యిప్పుడు తనకే మిగుల్తోంది.

తనకోసం యింట్లో ఎదురుచూసేవారు, అడిగేవారు లేకపోయేసరికి చక్రవర్తి,

## ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్య వ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలా వైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీ పురుషుల ఆస్తి హక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోషసంరక్షణకు ఎవరికెలా వ్రాయాలి. ప్రభుత్వ ఉచిత ఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసి పంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు ఇలాంటివెన్నో మీకు ఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ. 12. పోష్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావు నగరువద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా పొందండి

అమ్మాయిలను సరాసరి తన యింటికే తెచ్చుకొని వారితో విదేశీపానీయాలు, సిగరెట్ల మధ్య ఖుషీ చేయసాగాడు.

అమ్మాయిల వ్యామోహంలో చక్రవర్తి పిచ్చిగా ప్రవర్తిస్తూ, భార్య నగలు మారువాడీ దుకాణంలో తాకట్టు పెట్టి, అప్పులు చేయసాగాడు ... అయితే యీ విషయాలన్నీ సంధ్యకు తెలియకపోలేదు ... రెండుమూడుసార్లు హెచ్చరించింది, వారించింది, అలవాటయిపోయింది.

ఆమె పట్ల నిర్లక్ష్యం, చులకన, హేళన బయలుదేరాయి.

చక్రవర్తికి యిప్పుడు అప్పులు లభించడంలేదు. అతని సీటు మారిపోయింది. ఆదాయంలేదు దీనికి కారణం తన భార్యే అని అతనికి తెలియదు.

ఖరీదైన అమ్మాయిల సుఖం, పానీయాలు, సిగరెట్లు కరువయ్యాక చక్రవర్తి చిల్లర సుఖాలకు అలవాటయిపోయి ఆరోగ్యం పాడుచేసుకొందుకు ఎంతోకాలం పట్టలేదు.

* * *

సంధ్యారాణికి కొడుకు పుట్టాడు. వాడికి మూడునెలలు వచ్చేవరకు చక్రవర్తికి కొడుకుని చూసేందుకు తీరుబడే దొరకలేదు.

తండ్రిపోరు పడలేక, ఓరోజు అత్తవారింటికి వెళ్ళి భార్యని, కొడుకును చూసినట్లుగా అటెండెన్సు వేయించుకు వచ్చాడు. అల్లుడని చూడగానే, మావగారికేదో అనుమానం కలిగింది ... ఏదో అనారోగ్యం అతన్ని పీడిస్తున్నట్లు ఆయన పసిగట్టారు.

సంధ్యారాణికి యిదివరకున్న అనుమానం, యిప్పుడు భర్తని చూడగానే మరింత ధృవపడింది.

బాబుకు ఆరోనెల వచ్చినా, చక్రవర్తి భార్యని పంపించమని చెప్పలేదు ... అతని తండ్రి కూడా కోడలును పంపించమని వియ్యాలవారితో అనలేదు. కాని బాధ్యతగల ఉద్యోగంచేస్తూ, తను 'చక్రవర్తి భార్య' అనిపించుకోవడం యిష్టంగా వుండదు సంధ్యక్కూడా!

అటువంటి భర్త దగ్గరకు వెళ్ళేందుకు, అభిమానంవున్న ఏ భార్యా అంగికరించదేమో!

రోజులు...నెలలు...దొర్లిపోతున్నాయి.

సంధ్యారాణి ఆలోచనలకు తెరిపి వుండేది కాదు. అనుకోని పరిస్థితుల్లో తను చక్రవర్తిని కలియటం, వివాహం అవటం జరిగిపోయాయి...తను అనవసరంగా తొందర పడ్డానేమోనని ఆలస్యంగా అనుకొంటే ఏం ప్రయోజనం? భర్త ఆరోగ్యాన్ని గురించి ఎన్నో సార్లు హెచ్చరించింది ... అతనే నిర్లక్ష్యంగా వుంటున్నట్లు అభిప్రాయపడింది.

తన ఖర్మను ఎవరుమాత్రం సరిదిద్దగలరు? ఎలా వ్రాసివుందో అలాగే జరుగుతుందని, వేదాంతధోరణిలో ఆలోచిస్తోంది సంధ్యారాణి.

ఏ రెండుమూడు నెలలకో చక్రవర్తి భార్యని, కొడుకుని చూసేందుకు వెళ్ళేవాడు. అంతే!

* * *

భర్త మరణం సంధ్యారాణిని కొంత వరకు కుంగదీసింది. కాని అదంతా స్వయంకృతం! తన అత్తమామలు కూడా, కొడుకుని ఎందుకు వారించేవారుకాదో ఆమెకు అర్ధమయేది కాదు.

కాని అతను అద్దాల్లో పెరిగే పసివాడు కాదుగదా?

చక్రవర్తికి ఆఫీసునుంచి, సహకార బ్యాంకు నుంచి రావలసిన డబ్బు—గ్రాట్యుటీ, ప్రావిడెంటుఫండు. ఇన్సూరెన్సు వగైరా ... సిద్దమయ్యాయి. ఆ విషయం ఆమెతో చెప్పేందుకు వెళ్ళాను నేను. సరిగ్గా అదే సమయానికి సంధ్యారాణి మరిది కూడా రావటం జరిగింది.

అతను లోపలికెళ్ళి వదినగారితో ఏదో చెప్పి వెళ్ళిపోయాడు.

పదిహేనురోజుల తరువాత—


చక్రవర్తి తండ్రి, తల్లి కోడలు యింటికి వెళ్ళారు...తను మరిదితో చెప్పిన మాటలను బట్టి, వారు వచ్చివుంటారని భావించింది ఆమె.

కాసేపు బాబుగురించి తన గురించి యోగక్షేమ సమాచారాలు తెలుసుకొన్నారు. మాటలమధ్యలో ఆయన వచ్చిన విషయం తెలిపారు.

ఆ మాటలకు సంధ్యారాణికి కోపం కలిగిన మాట నిజమే! కాని తన కోపాన్ని ప్రదర్శించడం యిష్టంలేక ఆమె యీ విధంగా చెప్పింది—

"మీ అబ్బాయిని తన అలవాట్ల నుంచి తప్పించలేకపోయినా, ఆయన ఆరోగ్యం గురించి పట్టించుకోపోయినా ... తనకు రావలసిన డబ్బుకోసం వచ్చినందుకు నాకెంతో సంతోషంగా వుంది ... బహుశా నేను ఉద్యోగిని కాబట్టి మా జీవితాలకి నా జీవితం సరిపోతుందని మీరు అనుకొన్నారేమో! కన్న కొడుకు పాడైపోతుంటే, కన్నతండ్రిగా మీరు ఆయన్ని ఎప్పుడైనా మందలించారా, కనీసం వారించారా? కట్నంలో మిగిలిన డబ్బుని ఆయన చేతిలో పెడితే, ఆయనేం చేసారో తెలుసా మీకు? తన పడక గదిని సిగరెట్టు పెట్టెలు, బీరు, విస్కీ సీసాలతో అలంకరించారు.

సంధ్యారాణి అత్తగార్ని పిలిచి, "నేను ఆయన్ని ఎన్నోసార్లు వారించాను. ఆయన వినలేదు సరికదా... యిలా చూడండి..."



మీ గృహాలంకరణకు
కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్
బెడ్ షీట్స్, టవల్స్
కార్ సీట్ కవర్స్
ఆకర్షణీయమైన రంగులలో
అసంఖ్యాకమైన డిజైన్లలో
లభించును.
PHONE: 73708
డెకార్స
V.H.R. కాంప్లెక్స్
సిమెంట్ రోడ్
విజయవాడ-2

వెలువడింది
శ్రీమతి హజీరా
(ఆంధ్రసచిత్రవారపత్రిక సీరియల్)
తార
వెల 18. రూ.
1949-50 నాటి అగ్నిగుండానికి ఆహుతైపోయిన అమరవీరుల జీవితానికి అద్దం పట్టిన నవల
అన్నిబుక్ షాపులలో దొరకును లేదా మాకు వ్రాయండి
పుస్తకం ఖరీదులో 1 రూ. తగ్గించి M.O. చేయండి
ఆ రూపాయికే V.P.P. ద్వారా మీకు పంపగలము
వివరాలకు: శ్రీకవితా పబ్లికేషన్స్ మ్యూజియం రోడ్డు, విజయవాడ-2

అశేష ప్రజల
విశేష ఆదరాభిమానాలు పొంది
24 సం॥లు పూర్తిచేసుకొని
సిల్వర్ జూబ్లీకై పరుగులు తీస్తున్న
జెమిని పండ్లపొడి
వివిధ సైజులలో
లభించును




గట్టి చిగుళ్ళకు,
తెల్లని
మెరిసే పండ్లకు,
నోటి దుర్వాసన
పోగొట్టుటకు
సాటిలేని
మేటి పండ్లపొడి
జెమిని
భారతదేశంలో
ప్రప్రథమంగా
ప్రవేశపెట్టబడిన
నురుగవచ్చు పండ్లపొడి
జెమిని పెప్పరమెంట్
లవంగ నూనెల
అపూర్వ సమ్మేళనం.
తయారుచేయువారు
Ph. OFF-209 RESI-877
జెమిని కెమికల్ ప్రొడక్ట్సు
P.B. No. 7, మచిలీపట్నం-521 001 (ఏ.పి.)

## వెన్నెలకాసిన చీకటి బ్రతుకు!

అంటూ ఆమె తన 'బ్రా' తొలగించి కుడి వక్షంపై కాల్చిన సిగరెట్టు మచ్చని చూపించింది.

"ఇంతకన్నా రాక్షసత్వం ఇంకేమన్నా వుంటుందా?

ఆయనకుండే కోరికలు, ఆశలు, సరదాలు నాకు మాత్రం వుండవా? వాటిని తను నా ద్వారా తీర్చుకోకుండా బజారు స్త్రీలపై ఆధారపడడం ఏన్నానా బాగుందా? మరి నేను వాటిని అలాగే అణచుకోవలసిందేనా? నాకు మాత్రం దాంపత్య సుఖం అవసరం లేదా? నే నాశించే వసంతరాత్రులు, శోభనం రాత్రులు అన్నీ నిద్రాదేవికే జోలపాడాలా?"

సంధ్యారాణి ఆవేశంతో మాట్లాడుతోంది చక్రవర్తి తండ్రి విచారంతో ఏమీ మాట్లాడలేక పోయారు ఆయన భార్య కంట నీరు పెట్టుకొంది. అంతలో ఆమె ఓ పత్రిక ప్రకటన చూపింది, మావగారికి. ఆ ప్రకటనలో సారాంశం యిలా వుంది.

"ఆయన ఒక ఉపాధ్యాయుడు. ఆయనకు సంతానం నలుగురు. ఇద్దరబ్బాయిలు, యిద్దరమ్మాయిలు ఎన్నో ఆర్థిక యిబ్బందులతో బాధపడుతున్నాడు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి.

పెద్ద కొడుకు హిందీ మేష్టరు రెండో కొడుకు బ్యాంకులో అటెండరు. వారి దురదృష్టం వల్ల రెండో కొడుక్కి కడుపులో "ట్యూమరు" బయలుదేరింది. అప్పులుచేసి వైద్యం చేయించాడు. కాకినాడలో ఓ నిపుణుడికి చూపిస్తే, కేన్సరు లక్షణాలుగా కనబడుతున్నట్టుగా చెప్పాడు. బొంబాయి అమెరికన్ హాస్పిటలుకు తీసికెళ్ళమన్నాడు—

ఆ వ్యాధి పేరు వినగానే, ఆ కన్నతండ్రి భయపడి పోయాడు. వెంటనే బొంబాయి ప్రయాణమయ్యాడు అన్నిపరీక్షలు అయ్యాక ఆసుపత్రి వైద్యులు కేన్సరుగా నిర్ధారించి, ప్రారంభదశలో తొలగిస్తే ప్రాణందక్కేందుకు అవకాశాలున్నట్లు చెప్పారు. "—ఇట్లు దీక్షితులు... చిరునామా."

అందుకుగాను పన్నెండు వేలకు ఖర్చు చూపించారు.

ఆయన డిపాజిట్టుగా వెయ్యి రూపాయలు కట్టి, పైకం గురించి సహాయపడమని తెలుగు పాఠకులను కోరేడు.

ఆ ప్రకటన చూడగానే చక్రవర్తి తండ్రి కంటో నీళ్లు తిరిగాయి.

చక్రవర్తికి వచ్చిన సొమ్ములో నుంచి, పన్నెండు వేలకు డ్రాఫ్టు తీసుకొని ఆ కన్న తండ్రికి పంపించింది, వైద్యం నిమిత్తం సంధ్యారాణి

"నా కోరికలు తీర్చకపోయినా, కట్టుకొన్న భార్యను భార్యగా చూడకపోయినా. మీకొడుకు క్షేమం కోరి మీరేమీ చేయకపోయినా, కనీసం ఆయన ఆత్మ శాంతించాలని యీ విధంగా చేసాను. ఈ సొమ్ము ఎటూ ఆయన సంపాదించింది కాదు... అందుకే ధైర్యం చేసి ఓ ప్రాణం అయినా దక్కితే చాలనిపించి సహాయ పడ్డాను."

దుఃఖం దిగమింగుతూ అన్న మాటలకు, అత్త మామలు చలించి పోయారు. ఆమె ఔదార్యానికెంతో సంతోషించారు.

మిగిలిన ఆరువేలు సంధ్యారాణి మామగారి చేతిలో పెట్టింది. కాని ఆ సొమ్ము ఆయన మనవడి చేతిలో పెట్టి వెళ్లిపోయారు.

*　　*　　*

ఆరు నెలల తరువాత—

దీక్షితులు, ఆయన భార్య, కొడుకు రాఘవేంద్ర సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపేందుకు హైదరాబాదు వెళ్లారు.

వాళ్ళు వెళ్లేసరికి సంధ్యారాణి వళ్లో కూర్చుని బాబు అన్నం తింటున్నాడు. వాళ్ల వైపు ప్రశ్నార్థంగా చూసింది తను.

పరిచయాలు అయ్యాయి...

"భగవంతుడి దయకు, మీ సహాయం తోడై నా కొడుకు ఆరోగ్యం కుదుటబడింది. ఇప్పుడు వాడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు మీరు నాకన్నా చిన్నవారు, లేకపోతే కాళ్ళకు నమస్కరించేవాడిని. మీలాంటి వారు లోకంలో వుండబట్టే, యింకా నీతి, ఔదార్యం జీవించగలుగుతున్నాయి" అన్నారు దీక్షితులు గారు.

మరికొన్ని మాటల తరువాత వారు చక్రవర్తి గురించి అడిగారు. విషయంతెలిసేక ఎంతో విచారించారు.

వారికి భోజనాలు ఏర్పాటు చేసేందుకు సంధ్యారాణి వంటింటివైపు నడిచింది.

*　　*　　*

దీక్షితులుగారిభార్యఅనసూయమ్మ,సంధ్యారాణి పరిస్థితికి ఎంతో బాధపడుతుండగా, ఆవిడకో ఆలోచన వచ్చింది. భర్తని పిలిచి, యిలా చెప్పసాగింది—

"చూడండి ... ఆ అమ్మాయికి కలిగిన కష్టం.. మనవాడికి ప్రాణదానం చేసింది ... చిన్నవయస్సులోనే ఏ ముచ్చట, సరదా లేకుండానే పాపం భర్త పోయాడు ... తన ఋణం ఎలా తీర్చుకోగలం ... అందుకే ఓ పని చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం."

ఆ మాటలకు దీక్షితులుగారు కొంచెం కలవరపడ్డారు... భార్య ఏం చెప్పబోతున్నదో గ్రహించలేకపోయారు వెంటనే!

"ఆ అమ్మాయి చక్కగావుంది...వయస్సు కూడ ఏమంత అయిపోయిందని? బాబు చక్కగావున్నాడు... అభిమానం, ఆత్మీయత కనబడుతోంది...అందుకు ఆమెని నా పెద్ద కోడలుగా చేసుకోవాలని వుందండీ!" అన్నదావిడ.

దీక్షితులు ఆశ్చర్యపోయారు. నిజానికి ఆయన వుద్దేశం అదే అయినప్పటికి, భార్య ఏం చెప్పాలనుకుంటున్నదో ఎదురుచూసారు. అందుకే —

## భయం!

శాంతికి అశాంతి భయం!
కాంతికి విక్రాంతి భయం!
నవ సమాజ సభ్యుల కిల
అవగుణ సభికులుర భయం!

నీతికి అవినీతి భయం!
నిస్వార్థికి స్వార్థ భయం!
సర్వస్వామ్య స్వతంత్రతకు
నిరంకుశుల నిరతి భయం!

సంసారపు వొడుదుడుకుల
సంఘపు అపవాద భయం!
నూతన గిలిగింతలకు
యాతన సంతాన భయం!

కలిమికి లేమన్న భయం!
కామికి నిష్కామి భయం!
రాజకీయ పరితాపం
అరాజకుల పరిహాసం!

— "శ్రీవత్సస"

"నీ కేమయినా మతిపోయిందా? విధవరాలిని కోడలుగా చేస్తానంటావేంటి? మన ఆచారాలు, సాంప్రదాయాలు, వంశం, గోత్రం...ఏమయిపోతాయి? చూసినవాళ్లందరూ ఏమంటారు? నా కిష్టంలేదు ... ఆమె ఆర్థిక సహాయం చేసిందని యిలా అంటే నేనొప్పుకోను...అంతగా కావాలంటే రేపు రిటైరయ్యాక గ్రాట్యుటీ డబ్బు రాగానే తిరిగిచ్చేద్దాం..."

ఇంకా ఏదో అనబోయే లోపలే, అనసూయమ్మ అందుకొంది — "ఏమిటండీ మీ చాదస్తం? ఎవరో ఏదో అంటారని, కాదంటారా? వాళ్లేమైనా మీ కొడుకు వైద్యంకోసం సహాయపడ్డారా? అయినా భార్యపోతే, మగవాడు పెళ్లాడటంలేదా? ఆడదానికేం ఖర్మ పట్టింది ... అయినా రోజులు మారుతున్నాయి... మన పద్ధతులు, ఆచారాలుకూడా కాలాన్నిబట్టి మార్చుకోవాలి. నేను మాత్రం తనని నా కోడలుగా చేసుకొనేందుకు వెనుకాడను."

దీక్షితులుగారు 'రివర్సు గేరు'లో వస్తున్నారు. ఆయనే తన ఆలోచన, అభిప్రాయం చెప్తే భార్య ఒప్పుకోకపోవచ్చు. ఆడవాళ్ల అభిరుచులు ఎలా వుంటాయో? వాళ్ళు సర్దుకోగలిగితే, మగవాళ్ళకే మీ యిబ్బంది వుండదు.

అయినా భర్తపోతే, స్త్రీ పునర్వివాహం చేసుకోకూడదన్న రూలు ఎవరు పెట్టారు? పరిస్థితులు, రోజులు, అభిరుచులనిబట్టి మార్పు అందరిలోనూ రావాలి ... మంచిని అందరూ ఆదరించవలసిందే!

భోజనాలయ్యాయి. అనసూయమ్మ సంధ్యారాణితో తన అభిప్రాయం చెప్పింది.

రెండు నిముషాలు "తను మాయా లోకంలో లేనుకదా?" అనుకొంది. కాని ఆ ఆనందాన్ని బయటకు ఎలా చెప్పగలదు?

అనసూయమ్మ, సంధ్యారాణి నుదుట చెరిగిన కుంకుమను తిలకంతో దిద్దింది ... మాసిన జీవితానికి కొత్త జీవితం అందించింది. ఆ చీకటి జీవితంలో వెన్నెల కురిసేందుకు కొత్త చందుడు ప్రవేశించబోతున్నాడు.

దీక్షితులుగారు, భార్య, ఆయన కొడుకు ఆమెనుంచి సెలవు తీసుకొన్నారు.

ముద్దు పెట్టిన తడిబుగ్గలను బాబు తల్లికి చూపిస్తున్నాడు